దగా పడిన రైతు

- రైతు సంక్షేమం విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఖరీఫ్ సీజన్ ఆరంభమైనా అందని సాయం
- అన్నదాత సుఖీభవ పేరిట రూ.20 వేలు ఇస్తామని హామీ
- కానరానికి పథకం అమలు
- సాయం కోసం అన్నదాత ఎదురుచూపు

పూసపాటిరేగ: అధికార కూటమి చేతిలో రైతు దగా పడుతున్నాడు. గద్దె నెక్కి ఏడాది కావస్తున్నా అన్నదాతకు ఇచ్చిన ఎన్నికల హామీ అమలు చేయలేదు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పేరిట ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు చొప్పున సాగు సాయం అందిస్తామని కూటమి నాయకులు ఊదరగొట్టారు. ఇంతవరకు పథకం అమలు దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఎప్పుడిస్తారన్న స్పష్టత కూడా లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న వేళ.. ప్రభుత్వ సాయం కోసం కళ్లు కాయలు కాచేలా రైతాంగం ఎదురుచూస్తోంది.



పూసపాటిరేగలో ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసిన పొలాలు

గతంలో రైతు భరోసా ఆదుకుంది..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన రైతు భరోసా పథకం రైతులను ఆదుకుంది. ఏటా సమయానికి సాగు సాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేది. దీంతో పాటు రైతులకు సాగు సలహాలు, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందివ్వడం జరిగేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. మరో వారం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా అధికారంలోని చంద్రబాబు సర్కారు అన్నదాత సుఖీభవ పథకం అమలుకు చర్యలు చేపట్టలేదు. దీంతో అసలు ఈ ఏడాది పథకం ఇస్తారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సాగు ఆరంభానికి ముందే ఇస్తే సాగు పనులు సాఫీగా జరుగుతాయి కదా.. అని అంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు అందకపోవడంతో చేతిలో చిల్లిగవ్వ లేదని, ఈ నేపథ్యంలో సాగు ఎలా చేయాలని అన్నదాత ఆవేదన చెందుతున్నాడు.

నియోజకవర్గంలో 28 వేల మంది..

నెల్లిమర్ల నియోజకవర్గ వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన 28 వేల మంది రైతులు ఉన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తమకు ఇచ్చిన ఏ ఒక్క హామీ ఇప్పుడు అమలులో లేదన్నారు. పంటల బీమా, రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు ఇలా గతంలో ఇచ్చిన ఏ ఒక్క సదుపాయమూ లేకుంటే తామెలా సాగుకు ముందడుగు వేయాలని ప్రశ్నిస్తున్నారు. రైతులకు అండగా నిలిచే రైతు సేవా కేంద్రాలను కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని, వాటి ద్వారా అన్నదాతకు అవసరమైన సాగు సలహాలు, ప్రణాళికల తయారీ వంటివి కనిపించడం లేదని అంటున్నారు. గతంలో అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విత్తనం నాటడం దగ్గర నుంచి పంట విక్రయం వరకు అండగా ఉండేదని, అదే తరహాలో ఇప్పటి ప్రభుత్వం కూడా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో రైతులకు అందిన సాయం		
సంవత్సరం	రైతులు	అందిన సాయం
2019-20	25,394	రూ.34.28 కోట్లు
2020-21	30,638	రూ.41.36 కోట్లు
2021-22	30,426	రూ.41.08 కోట్లు
2022-23	30,954	రూ.42.20 కోట్లు
2023-24	32,533	రూ.43.83 కోట్లు

రైతులకు భరోసా ఏదీ..?

విజయనగరం: కూటమి సర్కారు.. సూపర్ సిక్స్ హామీలు మినహా వర్గాల వారీగా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతుండడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులు ఆరంభం కానుండడంతో ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన అన్నదాత సుఖీభవ పథకం కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. మరో వారం రోజుల్లో ఖరీఫ్ పనులు ఊపందుకోనుండగా ఇప్పటివరకు పథకం ఊసే లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం సంక్షేమ క్యాలెండర్ అమలు చేసి మరీ అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంది. చెప్పిన తేదీకి చెప్పిన పథకం అందించేది. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. నియోజకవర్గంలోని 5,249 మంది రైతులకు గతంలోని వైఎస్సార్ సీపీ సర్కారు ఏటా రూ.కోట్లు కేటాయించి, రైతుల ఖాతాల్లో సాగు సాయం జమ చేసేది. ఇప్పుడు అధికారంలోని కూటమి ప్రభుత్వం ద్వారా ఎటువంటి సాయం అందకపోవడంతో వడ్డీ వ్యాపారులను రైతులు ఆశ్రయించి అప్పులు చేసే పరిస్థితి నెలకొంది. పంటల బీమా కూడా లేదని ఎలా బతకాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇస్తామన్న పథకం సమయానికి ఇవ్వకపోతే సాగు ఎలా జరుగుతుందని నిలదీస్తున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకుల మాయమాటలు నమ్మి మోసపోయామని వాపోతున్నారు.

పెట్టుబడి సాయం జమచేయాలి..



అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం జమచేయాలి. రైతు సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించాలి. మరి కొన్నిరోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా నగదు సాయం అందక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

-టి.సీతారాం, సర్పంచ్, పూసపాటిరేగ

మే నెలలోనే ఇవ్వాలి..ఇంతవరకు లేదు..



ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్ సాగుకు ముందు మే నెలలో రైతుకు ఇస్తానన్న సాగు సాయం అందివ్వాలి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ఇంతవరకు డబ్బులు ఇవ్వలేదు. కనీసం పథకం ఎప్పుడిస్తారన్న స్పష్టత కూడా లేదు. సాగు ఎలా చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నాం. ఇబ్బందులు మొదలైనట్లే అనిపిస్తోంది. సీఎం స్పందించాలి.. త్వరగా డబ్బులు వేయాలి.

-తాడిశెట్టి బాబు, రైతు, మర్రిపేట

క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో కామాక్షి అమ్మవారు

విజయనగరం టౌన్: స్థానిక బొండాడవీధిలో శ్రీమహాగణపతి, కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 135 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయ పునఃప్రతిష్ఠ జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా శనవారం అమ్మవారికి పూజలు, అంకురార్పణ, వేదపారాయణం, మూలవిరాట్‌కు అభిషేకాలు, మంగళహారతి, రక్షాబంధనం, అఖండస్థాపన, మహానివేదన వంటివి చేపట్టారు.

అహల్యాబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

విజయనగరం టౌన్: సంఘసంస్కర్త, గొప్ప పరిపాలకురాలు అహల్యాబాయిని ఆదర్శంగా తీసుకోవాలని కొండగుంపాం ఉపాధ్యాయురాలు మక్కువ అరుణకుమారి కోరారు. స్థానిక గురజాడ అప్పారావు స్మారక భవనంలో రాణి అహల్యాబాయి జయంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పటి మహారాష్ట్రలోని మాల్వా దేశపు మహారాణిగా పేరొందిన అహల్యాబాయి తన పరిపాలన దక్షతతో ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకున్నారని, దాతగా, మానవత్వం చాటుకున్న మనిషిగా పేరొందారన్నారు. కార్యక్రమంలో సంస్కార భారతి జిల్లా శాఖ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి హోమం

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో పూర్ణాహుతి హోమం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి ప్రాతఃకాలార్చనల అనంతరం యాగశాలలో రామాయణంలోని పట్టాభిషేక హవనం చేసి, పూర్ణాహుతి జరిపించారు. అనంతరం స్వామి వెండి మండపం వద్ద శ్రీసీతారాముల నిత్య కల్యాణ మహోత్సవం చేశారు. నెలరోజుల పాటు యాగశాలలో నిర్వహించిన సుందరకాండ హవనానికి పుష్యమి నక్షత్రం సందర్భంగా పూర్ణాహుతి జరిపించామని అర్చకులు తెలిపారు.

జోరువానలో..



విజయనగరం జిల్లా కేంద్రం సహా కేఎల్ పురం, ధర్మపురి పరిసర ప్రాంతాల్లో శనివారం వాన కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై దాదాపు గంటన్నర నుంచి రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం పడింది. ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. రోడ్డుపై నీరు ఉండడంతో ఎక్కడ ఏ గొయ్యి ఉందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో కొంతమంది వాహనదారులు జాగ్రత్తగా తమ వాహనాలు నడుపుతూ కనిపించగా, మరికొంత మంది రయ్‌మని రహదారిపై దూసుకుపోయారు. అలాంటి వాటిని ఈ చిత్రంలో కొన్ని చూడొచ్చు.

-ఫొటోగ్రాఫర్, విజయనగరం









సత్కారం



బాబ్జీరావును సన్మానిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలో ఉద్యోగ విరమణ పొందిన అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ కేవీవీఎస్ బాబ్జీరావును కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శనివారం సత్కరించారు. ఎక్సైజ్ అధికారులతో కలెక్టర్ సమావేశం అనంతరం ఈ సన్మాన కార్యక్రమం జరగ్గా బాబ్జీరావును కలెక్టర్, సిబ్బంది దుశ్శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. అనంతరం ఆయన సేవలను ప్రశంసించారు. విధి నిర్వహణలో ఆయన చూపిన చిత్తశుద్ధి, నిబద్ధతను మిగతా వారు కూడా ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దొర తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన పోలీసులతో ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: స్థానిక పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు పోలీసులను శనివారం సన్మానించారు. ఆర్మ్‌డ్ రిజర్వు విభాగానికి చెందిన ఆర్ఎస్ఐ సంపతిరావు వెంకటరమణారావు పాత్రుడు, ఏఆర్ఎస్ఐ వెంకటేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ భావన శంకరరావులను దుశ్శాలువాలతో ఎస్పీ వకుల్ జిందల్ సత్కరించారు. మావోయిస్టుల కార్యాకలాపాలు, మాదక ద్రవ్యాల నియంత్రణకు సదరు పోలీసుల పనితీరు ప్రశంసనీయమైనవన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: పట్టణంలో ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావును శనివారం సత్కరించారు. ఇటీవల నిర్వహించిన 24 గంటల అన్నమయ్య సినీ సంగీత విభావరి కార్యక్రమ విజయవంతం పురస్కరించుకుని, ఈ సన్మాన కార్యక్రమం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



బాధితురాలి కూతురు శ్రావణికి నగదు అందజేస్తున్న సంస్థ సభ్యులు

విజయనగరం టౌన్: జిల్లాకు చెందిన నిరుపేద మహిళ విజ్జపు బంగారు లక్ష్మికి జిల్లా ఆర్యవైశ్య మిత్రులు చారిటీ గ్రూప్ అండగా నిలిచింది. పేగు వ్యాధితో బాధపడుతున్న ఆమెకు శస్త్రచికిత్స చేయాల్సి ఉండగా, తమవంతు సాయంగా రూ.50 వేలను బంగారులక్ష్మి కూతరు శ్రావణికి శనివారం అందజేశారు. ఆపదలో ఉన్న పేదింటి బిడ్డకు ఆర్థికసాయం చేయడం ఆనందంగా ఉందని, ఆమె ఆపరేషన్ విజయవంతమై త్వరగా కోలుకోవాలని గ్రూప్ సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సముద్రాల నాగరాజు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయానికి విరాళం అందజేస్తున్న రఘురామారావు

విజయనగరం టౌన్: స్థానిక ప్రేమ సమాజంలోని వృద్ధులకు వస్త్రదానంతో పాటు పండ్లు, రొట్టెలు, స్వీట్లు శనివారం పంపిణీ చేశారు. సోదరుడు, దివంగత కనకల శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కనకల రఘురామారావు తెలిపారు. పాతబస్టాండ్ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయానికి రూ.10 వేలు విరాళం కూడా అందజేశామన్నారు. సోదరుడి పేరిట ఓ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలకు ఈ విధంగా సేవ చేయడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయుడు, పుష్పకుమార్ రెడ్డి, మధు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం పడిగాపులు



జొన్నగుడ్డిలో వేచి చూస్తున్న పైడిరాజు



దుప్పాడలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధురాలు రామయమ్మ



స్టేడియం కాలనీలో పింఛన్ డబ్బులు కోసం చూస్తున్న పైడమ్మ

పింఛన్ కోసం వృద్ధులు పడిగాపులు కాశారు. శనివారం జూన్ నెల పింఛన్లు పంపిణీ చేయగా, కొన్ని గంటల పాటు ఆ పింఛన్ డబ్బుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీరు వ్యవస్థ ద్వారా వేకువజామున ఐదారు గంటలకు ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా పింఛన్లు అందించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో ఉద్యోగులు వచ్చి ఇచ్చినప్పుడే అందుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో లబ్ధిదారులంతా సిబ్బంది ఎప్పుడు వస్తారా.. ఎప్పుడిస్తారా అని వేచి చూడాల్సి వస్తోంది. విజయనగరం జిల్లా కేంద్రంలో అలాంటి కొన్ని దృశ్యాలు ఈ చిత్రాల్లో చూడొచ్చు.

-ఫొటోగ్రాఫర్ విజయనగరం

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

- ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి



విజయనగరం ఫోర్ట్: ర్యాలీలో డీఎంహెచ్‌వో జీవనరాణి, వైద్యారోగ్య సిబ్బంది



నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో భక్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యాన్ని పాడు చేసే పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి సూచించారు. నగరంలోని వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం శనివారం నిర్వహించారు. అనంతరం జరిగిన ర్యాలీలో సిగరెట్, ఖైనీ, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు తీసుకోవడం ద్వారా ఊపిరితిత్తులు పాడవ్వడంతో పాటు గొంతు, నోటి కేన్సర్‌లు వంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడే అవకాశం ఉందని, డీఎంహెచ్‌వో అవగాహన కల్పించారు. 40 ఏళ్ల వయసు దాటిన వారంతా తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే మేల్కోవాలన్నారు. ఏదైనా వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎల్‌వో కె.రాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సూర్యనారాయణ, డీఐవో అచ్యుతకుమారి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థంలో మిమ్స్, రెడ్‌క్రాస్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు దినోత్సవ ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు వల్ల కలిగే దుష్ప్రభావాలను మిమ్స్ వైద్యుడు షణ్ముఖ వివరించారు. పొగాకుతో తయారయ్యే సిగరెట్ తీసుకున్న వారితో పాటు ఆ పొగ పీల్చేవారు కూడా వ్యాధుల బారినపడతారన్నారు. ధూమపానం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా మెడికల్ అధికారి వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘిస్తే చర్యలు

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి గ్రామంలో నెలకొన్న చర్చి వివాదంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఐ.దుర్గాప్రసాద్ హెచ్చరించారు. సర్వే నంబరు 118-2లోని చర్చి వివాదం ఉన్నందున ఆ చర్చిలోకి బర్రి రాముడు, బర్రి అప్పన్న వర్గీయులకు ప్రవేశం లేదన్నారు. తదుపరి ఆదేశాలు వచ్చినంత వరకు ఈ నిబంధన కొనసాగుతుందన్నారు.

అన్నదానం

విజయనగరం టౌన్: సినీనటుడు, దివంగత సూపర్‌స్టార్ కృష్ణ జయంతి నగరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, మహేష్‌బాబు, సుధీర్‌బాబు ఫ్యాన్స్ అంతా అభయాంజనేయస్వామి ఆలయ దగ్గరున్న పేదలకు, రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతిగృహంలోని వారికి అన్నదానం చేశారు. అంతకుముందు కేక్ కట్ చేసి, కృష్ణ గారు సినీరంగానికి చేసిన సేవలను కొనియాడారు.

15న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

విజయనగరం టౌన్: మండలంలోని కేఎల్‌పురం కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 15వ తేదీన జరిగే ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవానికి క్షత్రియ రక్షణ సంఘం జిల్లా నాయకులంతా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఆయనకు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు గౌరీశ్వరరావు తదితరులు శనివారం మంత్రిని కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఎప్పటిలాగే ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో 85 శాతం పైబడి వచ్చిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు పురస్కారాలు అందిస్తున్నామని, వచ్చి విద్యార్థులను ఆశీర్వదించాలని కోరారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



పూసపాటిరేగలో యోగాసన సాధన చేస్తున్న ఎంపీడీవో రాధిక, ఇతర మహిళలు

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల యోగాసనాలు వేసే కార్యక్రమాలు చేపడుతున్నారు. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ఔత్సాహికులతో యోగా గురువులు యోగాసనాలు వేయించి, వాటి ప్రయోజనాలు వివరించారు. ప్రతిరోజూ యోగా చేయాలని, యోగా సాధన ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. యోగాతో శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందని గురువులు తెలిపారు.

-పూసపాటిరేగ, భోగాపురం



భోగాపురంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు

చెరువుల్లా పొలాలు

డెంకాడ: మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు వరదనీటితో నిండిపోయాయి. ఈ నేపథ్యంలో కొన్ని పొలాలు చెరువుల్లా కనిపిస్తున్నాయి. పెద్దఎత్తున వర్షపునీరు పొలాల్లో చేరుకోవడంతో దమ్ము పనులకు అవకాశం లేకుండా పోయిందని, ఇలా నీరు ఉంటే పదును దొరకదని పలువురు రైతులు వాపోతున్నారు.



పినతాడివాడ గ్రామ పొలాల్లో వర్షపునీరు